RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 245 | శుక్రవారం, ఫిబ్రవరి 13 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,



## రాబోయే పదిన్నరేళ్ల పాటు

# నేనే సీఎం

● 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు ● అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ● నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది ● ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తా ● నా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ అనేది లేదు ● కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్‌ట్యాపింగ్ కేసు సీబీఐకి... ● నిబంధనల ప్రకారమే సింగరేణి టెండర్లు ● ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 :** 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని ఆయన వెల్లడించారు. నూటికి నూరు శాతం తన ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదని స్పష్టం చేశారు. దిల్లీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చిందని, హైదరాబాద్ నగరాన్ని బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారుస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రికి ఇచ్చామన్నారు. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టునకు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నామని వెల్లడించారు. అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహం పెట్టితీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తానని తెలిపారు. 2018లో తెచ్చిన నిబంధనల ప్రకారమే సింగరేణిలో టెండర్లు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతానన్నారు. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా అని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. సింగరేణి సంస్థ అప్పులు తమ హయాంలో పెరగలేదన్నారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. సింగరేణి విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. మొత్తగా ఉన్నానని తనను మాత్రమే ఆయన ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు."2029

మిగతా2లో...

## నేడే మున్సి'పోల్' ఎన్నికల

# ఫలితాలు

- ఎవరికి ఎన్ని స్థానాలు
- ఫలితాలపై అభ్యర్థులలో ఉత్కంఠ
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు
- ఎక్కడా తగ్గకుండా పెద్ద ఎత్తున ప్రచారాలు
- నేడే మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేసిన ఈసీ
- ఉదయం 8 గంటల నుంచి జరగనున్న లెక్కింపు




వివరాలు 2లో

## చంద్రబాబు, లోకేశ్‌ను

# కలిసిన బండ్ల గణేశ్




**అమరావతి,ఫిబ్రవరి 12 :** సినీ నిర్మాత బండ్ల గణేశ్ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తాను మొక్కుకున్న మొక్కును ఇటీవల తిరుమలకు పాదయాత్రగా వెళ్లి చెల్లించుకున్న నేపథ్యంలో, ఈ భేటీ జరిగింది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్, ఆయనకు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు బండ్ల గణేశ్ ఒక సంకల్పం తీసుకున్నారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై, తిరిగి ముఖ్యమంత్రి అయితే తిరుమలకు నడిచి వస్తానని మిగతా2లో...

## ఎన్ని కార్పొరేషన్‌లు అయినా ఎగిరేది

# గులాబీ జెండాయే

### శేరిలింగంపల్లి నేతలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని

మిగతా2లో...

# సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి మిగతా2లో...

## మామునూరు ఎయిర్‌పోర్టు పనులు

# ప్రారంభించండి

- తెలంగాణ ఎయిర్‌పోర్టులకు అనుమతులు ఇవ్వండి
- కేంద్రమంత్రి రామ్మోహన్‌కు సిఎం రేవంత్ వినతి



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 12 :** వరం గల్ మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్ పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమ తులు, సహాయం కోరారు. భేటీలో మామూ నూరు , కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలా బాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి.

మిగతా2లో...

# తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా...

● ఉద్యమకారులకు అన్యాయం జరిగింది ● ఊహించిన దానికి భిన్నంగా నిర్ణయాలు ● అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది ● కోదండరామ్ లాంటి వారు ఆలోచన చేయాలి ● తన పక్కన పైరవీకారులు లేరన్న కవిత



**హైదరాబాద్,ఫిబ్రవరి 12 :** తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమ కారులే ఉన్నారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు కవిత. గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ మిగతా2లో...

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# రాబోయే పదిన్నరేళ్ల పాటు నేనే సిఎం

(మొదటి పేజీ తరువాయి)

ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు వచ్చింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ప్రతిపాదనలు కేంద్రమంత్రికి ఇచ్చాము. ఫ్యూచర్‌సిటీ, ఎయిర్‌పోర్టు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నా మని తెలిపారు. తన ప్రభుత్వంలో నూటికి నూరు శాతం ఫోన్‌ట్యాపింగ్ లేదని రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రజల అభిప్రాయాన్ని మాత్రమే తెలుసుకుంటానని ఆయన తెలిపారు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం తనకు అవసరం లేదని వివరించారు. ఎస్ఐబీ ఫిర్యాదుతోనే కేసు దర్యాప్తు జరుగుతోందని వివరించారు. ఎస్ఐబీలో పరికరాల మాయంతోనే కేసు బయటపడిందన్నారు. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు లేరని రేవంత్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ లేఖరాసి 6 నెలవుతుందని, కేంద్రం ఇంతవరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోలు వ్యవహారం కేసును త్వరలోనే సీబీఐకి ఇస్తామని ఆయన వెల్లడించారు. రాబోయే పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, తనకు రాష్ట్రంలో ఎవరూ పోటీ లేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా, ప్రతిపక్షాల్లో కూడా తనకు పోటీ ఇచ్చే నాయకుడు లేడని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బీఆర్ఎస్ నేతల విమర్శలపై స్పందిస్తూ, తనను విమర్శించిన వారికే తాను సమాధానం ఇస్తున్నానని, ఎవరిపైనా వ్యక్తిగత కక్ష సాధించడం లేదని అన్నారు. "కేసీఆర్‌ను జైల్లో పెట్టాలనుకుంటే ఎప్పుడో పెట్టేవాడిని. కానీ, ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమై స్వీయ శిక్ష విధించుకున్నారు. అలాంటి వ్యక్తిని జైల్లో వేయాల్సిన అవసరం నాకు లేదు" అని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలు ఉన్నప్పటికీ కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించడం లేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వివాదంపై రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పూర్తి వివరాలతో చర్చిస్తామని సీఎం తెలిపారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి ఈ వ్యవహారంలో వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని అన్నారు.

# తెలంగాణ జాగృతి పార్టీ పెట్టడం పక్కా...

(మొదటి పేజీ తరువాయి)

సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాలరాయబడ్డాయన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.. బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారన్న పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. చిన్న వారికి లాభం జరగలేదని తెలిపారు. కానీ మెగా కృష్ణారెడ్డి మాత్రమే కుబేరుడు అయ్యాడంటూ వ్యంగ్యంగా అన్నారు. అలాగే ఉద్యమకారులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలంటూ ప్రొఫెసర్ కోదండరాంకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత సూచించారు. ప్రొ.కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల లాంటి వారి వల్లే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. అయితే రెండేళ్ళుగా ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రొ.కోదండరాంను ఈ సందర్భంగా కవిత సూటిగా ప్రశ్నించారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సంక్షేమ బోర్డు ప్రకటన చేయాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 25 శాతం కోటాను ఉద్యమకారుల పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైన ఆరేండ్ల తర్వాత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి పెట్టారని మాజీ ఎమ్మెల్సీ కవిత అన్నారు. 1995లో వరంగల్ డిక్లరేషన్ తో మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైందని ఆమె చెప్పారు. స్వరాష్ట్ర ఉద్యమంలో మారోజు వీరన్న, గద్దర్ లాంటి వారు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ తెలంగాణ గడ్డపై విరామం లేకుండా ఒకదాని తర్వాత మరొక ఉద్యమం కొనసాగుతూనే వచ్చిందన్నారు. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పెట్టారని, నివ్పుకణికలా మండుతున్న ఉద్యమాన్ని అగ్గిరాజేసిందని అన్నారు. 2014లో తెలంగాణ తెచ్చుకున్నంక ఉద్యమకారులకు దక్కుతదని అనుకున్నమో వారికి న్యాయం జరగలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు సరైన న్యాయం జరగలేదని ఎక్కడైనా ఉద్యమకారులకు పదవులు దక్కితే వారు మిగతా వారిని పురుగులను చూసినట్లు చూశారని విమర్శించారు. 'తెలంగాణ ఉద్యమ సమయంలో మనను కొట్టించారో వారు సార్ పక్కనే చేరిండ్రు.. కేశవరావు జాదవ్ చనిపోతే ఆయనకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయా.. జయశంకర్ బొమ్మ కేబీఆర్ పార్కు వద్ద పెట్టాలని నాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ను పదే పదే అడిగిన.. సుప్రీంకోర్టు తీర్పు అడ్డొచ్చింది.. ట్యాంకు బండ్ మీద పెడతామన్న పెట్టుకోలేక పోయినం.. అక్కడున్న ఆంధ్రోళ్ల విగ్రహాలు తీస్తరని అనుకున్నం... తీయకపోతివి.. కనీసం మనోళ్ల విగ్రహాలైన పెట్టకపోతివి.. ఆ బాధ వెంటాడుతూనే ఉన్నది. ఇప్పుడొచ్చినైన ఎవరి బొమ్మలు పెడుతుండో అర్థం కాని పరిస్థితి ఉంది. ఉద్యమానికి వ్యతిరేకంగా గన్ను పట్టుకొని తిరిగిన రేవంత్ రెడ్డిని గెలిపించుకున్నం.. ఆయనకు ఏం సోయి ఉంటది తెలంగాణ అంటే. రవీంద్ర భారతిలో గద్దర్, బిరదరాజు రామరాజు, సుద్దాల విగ్రహాలు ఉండాల్సింది... ఎవరి విగ్రహాలున్నాయి. చేతులో ఉన్నప్పుడు చేసుకోలేదు. ఇప్పుడు మన చేతులో పోరాటం తప్ప ఏమీ లేదు. ఇప్పుడు పోరాడితేనే ఉద్యమ కారులకు న్యాయం జరుగుతుంది.' అని కవిత అన్నారు. తెలంగాణలోని ప్రైవేట్ సంస్థల్లో స్థానికులకు 20 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్జడెట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లును పాస్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన బండ్ల గణేశ్

(మొదటి పేజీ తరువాయి)

మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, చంద్రబాబు నాలుగోసారి సీఎం కావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో 'సంకల్ప యాత్ర' పేరుతో జనవరి 19న షాద్‌నగర్‌లోని తన ఇంటి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 23 రోజుల పాటు 535 కిలోమీటర్లు నడిచి, ఫిబ్రవరి 10న తిరుమల చేరుకున్నారు. రెండు రోజుల క్రితం శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నేడు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ ను ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. పాదయాత్ర సాగిన తీరును, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని బండ్ల గణేశ్ ముఖ్యమంత్రికి వివరించారు. ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ గురువారం రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా, ఇటీవల తాను పూర్తి చేసిన 'సంకల్ప పాదయాత్ర' గురించి మంత్రికి బండ్ల గణేశ్ వివరంగా తెలిపారు. షాద్‌నగర్ నుంచి తిరుమల వరకు 535 కిలోమీటర్ల పాటు 23 రోజుల పాటు సాగిన తన పాదయాత్ర అనుభవాలను, దాని వెనుక ఉన్న ఉద్దేశాన్ని లోకేశ్‌తో పంచుకున్నారు. అనంతరం, శ్రీవారి దర్శనం తర్వాత స్వీకరించిన తీర్థ ప్రసాదాన్ని లోకేశ్‌కు అందజేశారు. ఇరువురు నేతలు పలు అంశాలపై హృద్యంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. అంతకుముందు బండ్ల గణేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిశారు. ఏపీ అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో ఈ సమావేశం జరిగింది. చంద్రబాబు జైలు నుంచి విడుదల కావాలని తాను మొక్కుకున్న మొక్కును తీర్చుకోవడానికే ఈ పాదయాత్ర చేపట్టానని బండ్ల గణేశ్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఆయన్ను ఆత్మీయంగా పలకరించి, పాదయాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. బండ్ల గణేశ్ అందించిన తిరుమల ప్రసాదాన్ని స్వీకరించారు.

# నాపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గను

(మొదటి పేజీ తరువాయి)

ట్రేడ్ ద్వారా ప్రధాని మోదీ దేశాన్ని, రైతులను అమ్మేశారని ఆరోపించారు. ఈ క్రమంలో మోదీని రైతు వ్యతిరేకిగా అభివర్ణించారు. యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతుల్లో నరేంద్ర మోదీ పగ్గాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో తాను మాట్లాడిన ఓ వీడియోను రాహుల్ పోస్టు చేశారు.రైతుల జీవనోపాధిని హరించే లేదా దేశ ఆహార భద్రతను బలహీనపరిచే ఏ వాణిజ్య ఒప్పందం అయినా అన్నదాతలకు వ్యతిరేకమే. రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఆహార సరఫరాదారుల ప్రయోజనాలపై రాజీ పడనివ్వం. నిన్న(బుధవారం) నేను పార్లమెంటులో నిజం మాట్లాడాను. మీకు (ప్రభుత్వానికి) నచ్చకపోతే అది వేరే విషయం. దేశం సత్యాన్ని అర్థం చేసుకోగలదు. నేను రైతులపక్షాన నిలబడతాను. అస్సలు వెనక్కి తగ్గను. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ, నేను రైతులకు అండగా ఉంటాం. వారిని అన్యాయం జరగనివ్వమని అన్నారు. రైతులే దేశానికి పునాది అని రాహుల్ గాంధీ తెలిపారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ప్రధాని మోదీ దేశంలోని పత్తి, సోయాబీన్స్, యాపిల్, పండ్ల రైతులను అమ్మేశారని ఆరోపించారు. కొన్నేళ్లుగా విదేశీయులు దేశ వ్యవసాయ మార్కెట్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వారికి నరేంద్ర మోదీ ఈ ట్రేడ్ డీల్ ద్వారా ద్వారాలు తెరిచారని మండిపడ్డారు. ఇది నిజమని, ఈ విషయం మోదీకి కూడా తెలుసని విమర్శించారు. మోదీ తన మిత్రులైన అదానీ, అంబానీ, విదేశీ శక్తుల కోసం మొత్తం దేశ వ్యవసాయ మార్కెట్‌కు తలుపులు తెరుస్తారని ఆరోపించారు. మోదీ రైతు వ్యతిరేకి అని ఈ విషయం యావత్ దేశానికి, అన్నదాతలకు తెలుసని పేర్కొన్నారు.విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్ ద్వారాలు తెరవడం దేశ ఆహార భద్రత, రైతుల జీవనోపాధిపై చేసిన ప్రత్యక్ష దాడిగా రాహుల్ అభివర్ణించారు. పత్తి, సోయాబీన్స్, జొన్నలు, పండ్ల రైతులు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారన్నారు. దేశంలోని 99.5 శాతం మంది పేద, సన్నకారు రైతులే ఉన్నారని వెల్లడించారు. వారు పండించే పంటలకు మద్దతు ధర ఉండదని, సబ్సిడీలు కూడా అందవని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. అమెరికాలో వ్యవసాయం యంత్రాలను ఉపయోగించి చేస్తారని, వారికి ప్రభుత్వం భారీ సబ్సిడీలను అందిస్తుందన్నారు.

# నేడే మున్సి'పోల్' ఎన్నికల ఫలితాలు

హైదరాబాద్,ఫిబ్రవరి 12 :

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు నేడు వెల్లడి కానుంది. ఉదయం 8 గంటల 123 కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీల్లో 28 లక్షల 4వేల 274 ఓట్లు 7 కార్పొరేషన్లలో లక్ష 5 వేల 132 ఓట్లు లెక్కించాల్సి ఉంది. స్ట్రాంగ్ రూముల్లో 16 వేల 31 బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను భద్రపరిచారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియ, ఫలితాల వెల్లడికి సంబంధించిన మార్గదర్శకాలపై అధికారులకి రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లు లెక్కిస్తారు. పోలింగ్ కేంద్రం వారీగా 25 బ్యాలెట్ పత్రాలని ఒక బండిల్‌గా చేసి లెక్కింపు చేపట్టనున్నారు. ఒక్కో రౌండ్‌కు 40 కట్టలు అంటే వెయ్యి ఓట్లను కౌంటింగ్ టేబుల్‌కు పంపిస్తారు. ఓట్లను ఏజెంట్లకు చూపించి అభ్యర్థుల వారీగా ట్రేలో వేస్తారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 100 చొప్పున బండిల్ చేస్తారు. రౌండ్లు, టేబుళ్ల వారీగా అభ్యర్థులు నోటా, చెల్లని ఓట్ల వివరాలు నమోదు చేసి చివరకి ఫలితాలు ప్రకటించనున్నారు.ఓట్ల లెక్కింపు కోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లని రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇచ్చింది.చౌటుప్పల్‌తో పాటు చండూరు, జిన్నారం, పోచంపల్లి మున్సిపాలిటీల్లో 90 శాతానికిపైగా ఓటర్లు ఓటు వేశారు. 46 మున్సిపాలిటీల్లో 80 శాతం, 51 మున్సిపాలిటీల్లో 70 శాతం, 15 మున్సిపాలిటీల్లో 60 శాతం దాటింది.రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీల్లోని 2 వేల 582 వార్డుల్లో 13 లక్షల 61 వేల 285 మంది పురుషులు, 14 లక్షల 42 వేల 751 మంది మహిళలు, 238 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. ఏడు కార్పొరేషన్లలో 4 లక్షల 90 వేల 544 మంది పురుషులు, 5 లక్షల 14 వేల 475 మంది మహిళలు, 113 మంది ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేశారు. పోలింగ్ సరళిని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీ రాణికుముదిని, సీడీఎంఏ కార్యాలయంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి టీకే శ్రీదేవి నిరంతరం పర్యవేక్షించి, క్షేత్రస్థాయిలో అవసరమైన విషయాలను ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పూర్తయిందని ఊపిరి పీల్చుకున్న రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులు తమకు ఎన్ని ఓట్లు పడ్డాయోనని అంచనా వేసుకుంటున్నారు.

# భారత్ బంద్ సక్సెస్..

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని నిరసనకారులు డిమాండు చేశారు. ఈ చట్టాలు కార్మికుల హక్కులను బలహీనపరిచాయని, ఉద్యోగ భద్రతను తగ్గించాయని, ఉద్యోగ నియామకాలు, ఉద్వాసనలను యాజమాన్యాలకు సులభతరం చేశాయని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.ఎంజీనరేగాను పునరుద్ధరించాలని, వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్(గ్రామీణ్)ని రద్దు చేయాలని కూడా నిరసనకారులు డిమాండు చేశారు. ముసాయిదా విత్తన బిల్లు, విద్యుత్తు సవరణ బిల్లు, అణు ఇంధనానికి సంబంధించిన శాంతి చట్టాన్ని రద్దు చేయాలని కూడా కార్మిక సంఘాలు డిమాండు చేశాయి.

అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, ఒడిశా, బీహార్‌లో సమ్మె విజయవంతమైనట్లు తమకు సమాచారం అందిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ గురువారం తెలిపారు. బ్యాంకింగ్, బీమా, పోస్టల్, రవాణా, ఆరోగ్య, బొగ్గు, బొగ్గేతర గనులు, గ్యాస్ పైప్‌లైన్, విద్యుత్తు రంగాల్లో సమ్మె ప్రభావం ఉందని ఆమె చెప్పారు. సమ్మె కారణంగా భువనేశ్వర్, కటక్, రూర్కెలా వంటి నగరాల్లో రవాణా సర్వీసులు నిలిచిపోయాయి.

# మామునూరు ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించండి

(మొదటి పేజీ తరువాయి)

మామూనూరు విమానా శ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించి నందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ఒక సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సిఎం వెంట ఎంపిలు కడియం కావ్య, మల్లు రవి తదితరులు ఉన్నారు.

# సింగరేణి సిఎండిగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు , సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ , భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

# ఎన్ని కార్పోరేషన్‌లు అయినా ఎగిరేది గులాబీ జెండాయే

(మొదటి పేజీ తరువాయి)

నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు.నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.


# పంచాయితీలకు మరో రూ.387 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

## ● నిర్మాణాలు కూల్చివేస్తుండగా అడ్డుకున్న స్థానికులు



హైదరాబాద్,ఫిబ్రవరి 12 :

హైదరాబాద్‌లోని మాదాపూర్ ఖానామెట్‌లో ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబర్ 55లో రోడ్డుపై ఉన్న దుకాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇక్కడి అర్ధనారీశ్వర ఆలయం సమీపంలోని నిర్మాణాలను కూల్చివేస్తుండగా ఆలయ కమిటీ సభ్యులు, పుజారులు, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిర్మాణాలపై స్టేటస్ కో ఉందని అయినప్పటికీ హైడ్రా అధికారులు కూల్చివేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపట్టారని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, అనుమతులు లేకుండా భవనాలు, షెడ్డు నిర్మించారని ఆరోపిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూమిలో రోడ్డు పక్కన అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారని, అవి అక్రమ నిర్మాణాలని హైడ్రా అధికారులు చెబుతున్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య ట్రాన్స్‌ఫార్మర్‌పై మళ్లీ దుండగుల దాడి

**- రాజకీయ కక్షతో రైతుల ఆస్తులపై దాడులు కాంగ్రెస్ గుండాల అరాచకం ఆపాలి మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య.**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12 :- తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన మాజీ ఆత్మ కమిటీ చైర్మన్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు దుర్గం రమణయ్య, బెల్లంకొండ సారక్కకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు నిన్న రాత్రి ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లు అపహరించారు. ఇదే ఘటన రెండోసారి చోటుచేసుకోవడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఇలా అవ్వడం వెనుక రాజకీయ కక్ష స్పష్టంగా కనిపిస్తోందన్నారు.ఇటీవల తాడ్వాయిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ తరఫున కీలక పాత్ర పోషించినందుకు కక్ష కట్టి, కాంగ్రెస్ కావాలనే భౌతిక దాడులు ఇలాంటి చిల్లర దుశ్చర్యలకు పాల్పడుతున్నారని రమణయ్య మండిపడ్డారు.రైతుల జీవనాధారమైన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడం అంటే రైతు కుటుంబాన్ని నేరుగా దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.ములుగు జిల్లా ప్రజలు ఈ అరాచకాలను గమనిస్తున్నారని, రాజకీయ ప్రతీకారంతో చేసే ఇలాంటి దాడులకు త్వరలోనే ప్రజలే గట్టి సమాధానం ఇస్తారని హెచ్చరించారు.రాబోయే ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు రాజకీయ సమాధి కడతారు అని స్పష్టం చేశారు.ఈ ఘటనపై వెంటనే కేసు నమోదు చేసి, కాంగ్రెస్ దుండగులను గుర్తించి అరెస్టు చేయాలని పోలీసు అధికారులను ఆయన డిమాండ్ చేశారు.రైతుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని, లేదంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు: 350 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

**- విజయోత్సవ ర్యాలీలపై సంపూర్ణ నిషేధం**

సూర్యాపేట, ఫిబ్రవరి 12: (హైదరాబాద్ ఎస్టేట్ ఈ--న్యూస్): సూర్యాపేట జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపిఎస్ తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 350 మంది పోలీస్ సిబ్బందితో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు.ఓట్ల లెక్కింపు కేంద్రంగా ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాల్లో 163 దీఛీూా (144 సెక్షన్) నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు రేపు ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు.లెక్కింపు కేంద్రాల్లోకి ప్రవేశించే అభ్యర్థులు, ఏజెంట్లు తప్పనిసరిగా ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, అవి ఉన్నవారికే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. భద్రతా దృష్ట్యా అగ్గిపెట్టెలు, లైటర్లు, ఇంక్ బాటిళ్లు, పేలుడు పదార్థాలు లేదా ప్రమాదకర వస్తువులు లెక్కింపు కేంద్రాల్లోకి తీసుకురావద్దని హెచ్చరించారు.



తనిఖీలు నిర్వహించే సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చడం వంటి కార్యక్రమాలకు పూర్తిగా నిషేధం విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక బందోబస్తుతో పాటు క్యూఆర్టీ బృందాలు, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీములు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.ముఖ్య సూచనలు:ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలి.ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలకు అనుమతి లేదు.శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలి.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తారు.ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించాలంటే సంబంధిత అధికారుల అనుమతితో, నిర్దేశిత తేదీల్లో మాత్రమే నిర్వహించాలి.ప్రజలందరూ శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడుతూ ఎన్నికల ఫలితాలను పరస్పర గౌరవంతో స్వీకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# శాంతి భద్రతల కోసం సెక్షన్163 ఆదేశాలు ఫ్యూచర్ సిటీ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12 :- తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలు కాపాడుటకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ భారతీయ నాగరిక సురక్షా సంహిత (బి ఎన్ ఎస్ ఎస్ ) సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు జారీ చేశారు. 13-02-2026 తేదీన ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 11:00 గంటల వరకు సంబంధిత కౌంటింగ్ కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో 5 మందికి మించిన గుంపులు కూడకుండా నిషేధం అమల్లో ఉంటుంది.ఈ ఆదేశాలు ఆమనగల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మరియు చేవెళ్ల ప్రాంతాల్లో అమలులో ఉంటాయి.ప్రజలు పోలీసులకు సహకరించి శాంతి భద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేయబడింది. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. అని తెలియజేశారు.

# కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

**- సిపిఎం పార్టీ మద్దతూ తెలుపుతూ.. పార్టీ జిల్లా కార్య దర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ**






(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12:- కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నేడు ఫిబ్రవరి 12న జాతీయ సార్వత్రిక సమ్మె జరుగుతున్నది, వివిధ 75 రకాల ప్రభుత్వ స్కీములలో పనిచేస్తున్న కార్మికులు దేశవ్యాప్తంగా ఈ సమ్మెలో పాల్గొంటున్నారు, ఇలాంటి కీలక పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి, కార్మికులుగా గుర్తించాలి అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం, గ్రామపంచాయతీ వర్కర్స్, మున్సిపల్ వర్కర్స్, వి,వో ఏ, ఆర్ ,పి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రంగాల్లో వైద్యం ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్, అర్బన్ హెల్త్ సెక్రటరీలు, ఏ,ఎన్,ఎం, స్టాఫ్ నర్సులు , ఎం,ఎల్ ,హెచ్, పి మెంటల్ హెల్త్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న సామాజిక భద్రత సౌకర్యాలు అమలు చేయాలి, కేంద్ర ప్రభుత్వం మూడవసారి అధికారం వచ్చిన తర్వాత 43 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా విభజించారు, ఎనిమిది గంటల పని దినాన్ని10 గంటలుగా చేశారు,ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేశారు, దీన్ని వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, కార్మికుడు చనిపోతే 5 లక్షలు ఇవ్వాలని,రిటర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం మాత్మ గాంధీజాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి రామ్ జీ అని పేరు పెట్టారు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ లో ర్యాలీగా నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు ఎ సామెల్, సిపిఎం మండల కార్య దర్శి ఎష్ట్ర బుగ్గ రాములు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యెలామోని స్వప్న, చింత పట్ల ఎల్లేశ, ఇబ్రహీంపట్నం మండల సి,ఐ,టి,యు కన్వీనర్ పి.జగన్,మహేష్, గిరి, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు బాలమణి మధ్యాహ్నం భోజనం నాయకురాలు నాయకురాలు రాధ లావణ్య పాల్గొన్నారు.

# పాత జీ.ఓ ప్రకారమే జర్నలిస్టులకు అక్రెడిటేషన్స్ ఇస్తాం

**- సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12 :- హైదరాబాద్: జర్నలిస్టులకు పాత జీ.ఓ ప్రకారమే అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో మంత్రి పొంగులేటిని టీయూడబ్ల్యూజే నేతలు, కేబుల్ చానెల్స్ జర్నలిస్టుల జేఏసీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జీ.ఓ 252, జీ.ఓ 103లో కేబుల్ ఛానల్స్ కు అక్రెడిటేషన్స్ జారీ విషయంలో అన్యాయం జరిగిన విషయాన్ని మంత్రికి వివరించారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత జీ.ఓ ప్రకారమే జర్నలిస్టుకు అక్రెడిటేషన్స్ ఇస్తామని స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందివద్దని మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, తెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, సిటీ కేబుల్ ఎం.డి శివరామ కృష్ణ, ఎం.ఎస్ ఓ సంఘం నాయకులు వంగా శ్రీనివాస్ రెడ్డి, కేబుల్ చానెల్స్ జేఏసీ నాయకులు కడకంచి వెంకటేష్, హెచ్ వి.చలపతి, దేవేందర్, అరవింద్, బ్రహ్మం, రాజేష్ తదితరులు ఉన్నారు.

# కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలీ

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12:- దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపులో భాగంగా యాచారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం సాగర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హాజరై మాట్లాడుతూ విరోచితంగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్ లను 6 సంవత్సరాల క్రితం 2019, 2020 సంవత్సరాలలో తెచ్చి కార్మిక సంఘాలు ,కార్మిక చట్టాలులేని దేశంగా మార్చాలని కార్మికులని నీరాయుదులను చేసి పెట్టుబడుదారులు, పారిశ్రామికవేతలు, కార్పొరేట్లకు లాభాలు పెంచేందుకు 2025 నవంబర్ 21న లేబర్ కోడ్స్ అమల్లోకి నోటిఫికేషన్ జారీ చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ ల వల్ల అమలుతో 40 కోట్ల సంఘటిత, ఆసంఘటిత కార్మికులు వారి కుటుంబాలు చితికి పోయేలా చట్టాలను మారుస్తున్నదని బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్నారు ట్రేడ్ యూనియన్ చట్టం.1926 ప్రకారం యూనియన్లు ఏర్పాటు కార్మికుల హక్కు, ఆ సంఘటితమయ్యే హక్కు నిరసనలు, సమ్మె చేసే హక్కులపై ఉక్కు పాదం మోపుతున్నారని విమర్శించారు. ఉద్యోగ భద్రత పట్ల యజమాన్యాలకున్న అన్ని బాధ్యతలను తొలగించారని విమర్శించారు.హైర్ అండ్ ఫైర్ పద్ధతి తీసుకొచ్చి పర్మినెట్ ఉద్యోగాలకు మంగళం పాడారు. కోర్ యాక్టివిటీ లో సైతం విచ్చలవిడిగా కాంట్రాక్ట్ కార్మికులను నియమించుకోవడం చట్టపరం చేశారు. ఫిక్స్ టర్మ్ ఉపాధిని శాశ్వతం చేసింది ఈ విధానవల్ల పెట్టుబడిదారులకు అనేక రేట్లు లాభాలు పెంచేందుకు అవకాశం కల్పిస్తుందని విమర్శించారు.కార్మికులకు రిటన్స్ మెంట్, లే ఆఫ్ లకు వందమంది కార్మికులు పనిచేసే పరిశ్రమ విజయం యజమాన్యం ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని నిబంధనను ఎత్తివేసి 300 అమ్మలకు పెంచారు. లేబర్ అధికారుల కోరలు పీకి ఫెసిలిటేటర్ గా మార్చి వారిని మధ్యవర్తులుగా రాయబారాలు చేసే అనమాకులుగా నిర్ణయించారు. లేబర్ కోర్టు లను రద్దుచేసి వాటి స్థానంలో పారిశ్రామిక ట్యూబ్యునల్ ఏర్పాటు చేయనున్నారని విమర్శించారు.కనీస వేతనాలు బదులుగా ఫ్లోర్ లెవెల్ కనీస వేతనం అమలు చేయనునట్టు లేబర్ కోడ్ లలో పేర్కొన్నారు కనీస వేతనాలు నిర్ణయానికి ఇప్పటివరకు ఉన్న డాక్టర్ అక్రాయిడ్ సిఫార్సు లు, 1957 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సు లు, 1992 నాటి లాప్టాకోస్ బ్రెట్ కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు తిలోదకాలిచ్చారు. ఈ కోడ్ లో కనీస వేతనం నిర్వచనమే లేదు వేతనాలు ఎలా నిర్ణయిస్తారు చెప్పలేదు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేషనల్ ఫ్లోర్ లెవెల్ వేతనం రోజుకు 178 రూపాయలు, నేల వేతనం 4628 రూపాయలకు తక్కువ కాకుండా ఏ రాష్ట్రంలో ఇవ్వకూడదంటున్నారు. ఇదే అమలు అయితే ప్రస్తుతం కార్మికులు అదనంగా పొందే వేతనాల్లో భారీ కోతలు తప్పవని కార్మికులు జీవించడమే గాహనంగా మారునున్నది అని అన్నారు.పని ఎన్ని ఎన్ని గంటలు ఉండాలో ఎప్పుడు విరామం ఉండాలో ఎంత స్ప్రెడ్ పవర్ టైమ్ ఉండాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు మే దేస్ఫూర్తితో పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినం యొక్క పోరాట స్ఫూర్తిని నేటికీ కార్మిక వర్గానికి తెలియకుండా చేసే ప్రయత్నాలకు పునుకున్నారు. మన రాష్ట్రం తో పాటు ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో పని దినాన్ని 10 గంటలకు స్ప్రెడ్ ఓవర్ టైంను 12 గంటలకు పెంచుతూ చట్ట సవరణ చేశారని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ లు ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ మరియు ప్రసుతి ప్రయోజనాల వంటి అన్ని ప్రయోజనాలను మింగేస్తున్నారని విమర్శించారు. భవన ఇతర నిర్మాణ కార్మికులకు పని భద్రత పిఎఫ్ ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డు లో పేర్కొన్న పథకాలు ఎలా లభిస్తాయని అంశంలో లేబర్ కోర్సులో నిర్దిష్టమైన ప్రస్తావనే లేదని విమర్శించారు. అలాగే అంగన్వాడి, ఆశ ,మధ్యాహ్న భోజనం ,ఐకెపి, వివోఏ, ఆర్ పి, ఉపాధి హామీ నేషనల్ హెల్త్ మిషన్ లాంటివి స్కీం లల్లో పనిచేస్తున్న వారిని కనీసం కార్మికులు గా కూడా గుర్తించడం లేదని విమర్శించారు. అదేవిధంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సరైన బడ్జెట్ కేటాయించకుండా మహాత్మా గాంధీ పేరును తొలగించి వికాస్ జి రాంజీ పేరు పెట్టాలని ఆలోచన చాలా దుర్మార్గమైన ఆలోచన అని అన్నారు వెంటనే వికాస్ జి రాంజీ పేరును వెంటనే రద్దుచేసి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో కొనసాగించాలని ఆ పథకానికి సరైన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కావున కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వెంటనే 4 లేబర్ కోడ్స్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులు కర్షకులు కలిసి దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి అంజయ్య, సిఐటియు మండల కన్వీనర్ ఎస్ చందు నాయక్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అలంపల్లి జంగయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు తావునాయక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జంగయ్య, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విప్లవ కుమార్, ధర్మాన గూడెం మాజీ సర్పంచ్ భాషయ్య, కొత్తపల్లి మాజీ ఉపసర్పంచ్ జగన్, ప్రజాసంఘాల నాయకులు పీరియాటి వెంకటయ్య, బాలరాజ్ సత్యం, కందుల శ్రీరాములు, బర్ల మల్లేష్, రమేష్ , సురేష్, సత్యనారాయణ ,జంగారెడ్డి, వినోద్ కుమార్, ఆనంద్, బట్టు జంగయ్య, వెంకట్ రెడ్డి, సాయికుమార్, గణేష్ యూనియన్ల నాయకులు టి కవిత ,మైసమ్మ ,జయమ్మ, అండాలు ,వసంత, శోభారాణి, లలిత ,అలివేలు, యాదగిరి ,డివికె రమేష్ నరేందర్, పద్మ ,నరేందర్ పాల్గొన్నారు.





RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# ఈనెల17న తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య విగ్రహావిష్కరణ ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**- పెద్దపులినాగారం గ్రామంలో.. తెలంగాణ అమరవీరుడి సిరిపురం యాదయ్య విగ్రహ ఏర్పాటు**





**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో తెలంగాణ అమరవీరుడైనటువంటి సిరిపురం యాదయ్య జన్మదిన సందర్భంగా.. సొంత గ్రామంలో విగ్రహావిష్కరణ ఏర్పాటు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారు, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణ త్యాగం చేసిన పెద్దపులి నాగారం ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య విగ్రహం ప్రైమరీ స్కూల్ ముందు ఏర్పాటు చేయనట్టుగా గ్రామ సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్ తోపాటు పిఎసిఎస్ మాజీ చైర్మన్ మంచే పాండు యాదవ్, మాజీ ఉపసర్పంచ్ లతీఫ్ ఖాన్, చెన్నా సంజీవ, చేన్న తిరుపతయ్య, ఆయిల యాదయ్య గౌడ్, చాన్ పాషా, గ్రామ శాఖ అధ్యక్షులు ఆయిల శివ గౌడ్, పల్నాటి అశోక్, దాస వెంకటయ్య, దాస శ్రీను, దాస రామ్, ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహేశ్వరం ఎమ్మెల్యే రాన్నట్టుగా తెలియజేశారు.

# మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టియుసి కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ

**- మహేశ్వరంలో ఉద్యోగ భద్రత కోసం భారీ నిరసన నడికుడ శివ**




**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో.. నియోజకవర్గం కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ మాట్లాడుతూ ... కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా సమ్మెకు కార్మికుల సంఘాలు పిలుపునిచ్చాయి కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్మికుల హక్కుల దెబ్బతీస్తున్నాయని ఆయన ఆరోపించారు కార్మికుల సంక్షేమం ఉద్యోగ భద్రత వేతనాల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహేశ్వరంలో శివ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.. కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ అసంఘటితరంగ కార్మికులను పర్మినెంట్ చేయాలి, స్కీం వర్కర్స్ కి కనీసం వేతనం 26 వేలు ఉండాలి ఈఎస్ఐపి ఎఫ్ గ్రాడ్యుటి బెనిఫిట్స్ ఇవ్వాలి, ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం ఆపాలి, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర పెంచి రైతులను ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్దించాలి, అసంఘటితరంగా కార్మికుల కు సామాజిక భద్రత పథకాన్ని ప్రవేశపెట్టాలి, కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వమే కార్మికులకు జీతాలు చెల్లించాలి, వ్యవసాయ మార్కెట్లలో దడువాయి కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 65 కు పెంచాలి, మెడికల్ కాంటాక్ట్ ఎన్.హెచ్.ఎం రెండవ ను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలి, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి, నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని మహేశ్వరం నియోజకవర్గం ఐఎన్టీయూసీ కార్మిక శాఖ అధ్యక్షులు నడికుల శివ ఈ సందర్భంగా తెలియజేశారు

# ఫార్మాసిటీ రోడ్డుపై సరస్వతి ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం -- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి** మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఫార్మాసిటీ రోడ్డుపై సరస్వతి ఫిల్లింగ్ స్టేషన్ పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కందుకూరు మండలం అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్,పి.ఎస్.ఎస్ మాజీ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్,మహిళా అధ్యక్షురాలు తాంద్ర ఇంద్రర-దేవేందర్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుయ్యాని సామయ్య,యూత్ అధ్యక్షులు తాళ్ల కార్తీక్ పాల్గొన్నారు.అలాగే సర్పంచులు మేఘనాథ్ రెడ్డి,లలితా కుమార్,మాజీ సర్పంచ్ కాకి ఇందిరా,దశరథ ముదిరాజ్, మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాష్ రెడ్డి,పొట్టి ఆనంద్,స్పోర్ట్స్ కన్వీనర్ వెంకటేష్,సబితమ్మ సోషల్ మీడియా ప్రతినిధులు బొక్క దీక్షిత్ రెడ్డి,కాకి రవీందర్ ముదిరాజ్,గోరింకల రామకృష్ణ,దాసు తదితర పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌ను ముక్కలు చేయొద్దు




**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12:-**
గురువారం పత్రిక విలేకరుల సమావేశంలో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజల మనోభావాలను గౌరవించాలిరాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని హైదరాబాదు కార్పొరేషన్‌లో విలీనం చేయాలనే తాజా జీవోపై మేము తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాము. సైబరాబాద్‌ను ఒక కార్పొరేషన్‌గా, హైదరాబాదును మరో కార్పొరేషన్‌గా విభజించే ప్రక్రియలో సింహభాగంగా ఉన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం ను చేర్చడం పూర్తిగా అన్యాయం.ఇప్పటికే ఈ అంశంపై పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాం. స్థానిక ఎమ్మెల్యేకి కూడా లేఖ ఇచ్చి, జీహెచ్ఎంసీలో విలీనం చేయకుండా రాజేంద్రనగర్ ప్రత్యేకతను కాపాడాలని విజ్ఞప్తి చేశాం. అయినప్పటికీ ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా ముందుకు సాగుతోంది.రాజేంద్రనగర్‌ను ముక్కలు చేయడం వల్ల మా ప్రాంత విశిష్టత, అస్తిత్వం దెబ్బతింటుంది. ఒకవేళ మూడు కార్పొరేషన్లు చేయాల్సి వస్తే, రాజేంద్రనగర్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనే మా స్పష్టమైన డిమాండ్. హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా చేస్తే, జనాభా లెక్కలు, పరిపాలనా సౌలభ్యం, డివిజన్ల సంఖ్య వంటి అంశాల్లో స్పష్టమైన లాజిక్ ఉండాలి.మేడ్చల్--మల్కాజ్గిరి 75 డివిజన్లు, సైబరాబాద్ 75 డివిజన్లు ఉంటే, హైదరాబాదుకు 150 డివిజన్లు ఎందుకు?జనాభా సుమారు సమానంగా ఉంటే ఈ అసమానతకు కారణం ఏమిటి? ఈ నిర్ణయంలో సాంకేతికత ఎక్కడ? పారదర్శకత ఎక్కడ? ప్రజలను అడగకుండా, స్థానిక శాసనసభ్యుల అభిప్రాయం తీసుకోకుండా ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. రాజేంద్రనగర్ ప్రజల మనోభావాలు తెలుసుకోవాల్సిన అవసరం లేదా హైదరాబాద్ కార్పొరేషన్‌లో కలిపిన తర్వాత మా ప్రాంతానికి మేయర్ పదవి వస్తుందని హామీ ఇవ్వగలరా? కనీసం మీ పార్టీ వ్యక్తికైనా వస్తుందని గ్యారెంటీ ఇవ్వగలరా?ఒకవేళ వేరే వర్గానికి మేయర్ పదవి వెళ్తే, అభివృద్ధి నిధులు, ప్రణాళికలు సమానంగా అందుతాయా? లేక మా ప్రాంతం పన్నులు కడితే, ప్రగతి వేరే ప్రాంతాలకు మళ్లుతుందా? ఈ పునర్విభజన వెనుక ఎవరి ప్రయోజనాలున్నాయో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోంది. రాజేంద్రనగర్‌కు న్యాయం చేయాలి. ప్రజల అభిప్రాయాలను గౌరవించాలి. మా ప్రాంతానికి నష్టం కలిగించే ఏ నిర్ణయాన్నైనా మేము తీవ్రంగా వ్యతిరేకిస్తాం. రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ని మేము ప్రశ్నిస్తున్నాము మీరు నాలుగు సార్లు గెలిచిన ఎమ్మెల్యే. బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత మా ప్రాంతానికి జరుగుతున్న ఈ అన్యాయంపై నిజంగా ముఖ్య మంత్రితో మాట్లాడారా? మీ మాటకు ప్రభుత్వం విలువ ఇస్తుందా? లేక రాజేంద్రనగర్ ప్రయోజనాలు పక్కన పెట్టబడ్డాయా? మీరు నిజంగా మా ప్రాంత ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే, ఈ విలీనాన్ని బహిరంగంగా వ్యతిరేకించాలి.ముఖ్యమంత్రిని కలిసి స్పష్టమైన హామీ తీసుకురావాలి. లేదంటే ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతాయి. అవసరమైతే కోర్టు ద్వారానైనా న్యాయం సాధిస్తాం. మా అస్తిత్వం, మా రాజకీయ హక్కులు, మా ప్రాంత గౌరవం కాపాడుకునే వరకు ఈ పోరాటం ఆగదు.అని పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు

# విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలి





**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12:-**
తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ కు సమీపంలో నిర్మించనున్న మామునూరు విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కె. రామ్మోహన్ నాయుడుకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు మెయింటెనెన్స్, ఓవర్ హాల్ రిపేర్ (ఎంఓఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, వరంగల్‌కు దగ్గరలో రెండేళ్లకోకసారి ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క - సారలమ్మ జాతర మేడారంలో నిర్వహించడం వంటి ప్రాధాన్యతలను వివరించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ ఉమ్మడి వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు కేంద్రంగా ఉంటుందని ముఖ్యమంత్రి వివరించారు. మామునూరు నుంచి సాధ్యమైనంత త్వరగా విమాన రాకపోకలు సాగేలా పనులు ప్రారంభించేలా అనుమతులను తక్షణం మంజూరు చేయాలని కోరారు. విమానాశ్రయ ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారుసమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్ఐసిలో వాటాల ఉపసంహరణ రద్దుచేయాలి!

**దేశవ్యాప్త సమ్మెలో మంచిర్యాల బీమా ఉద్యోగులు**




**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి మంచిర్యాల**
ఎల్ఐసి సంస్థలో వాటాల ఉపసంహరణతో దేశ ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయి కాబట్టి సదరు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఇన్సూరెన్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండు చేసారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం రోజున మంచిర్యాల బీమా ఉద్యోగులు విధులను బహిష్కరించి ఆఫీసు ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. లాభాలనార్జిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం ప్రజావ్యతిరేకమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కొత్త లేబరు కోడుల ద్వారా కార్మిక హక్కులను హరించి కార్పొరేట్లకు అనుకూల విధానాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్నదని వారు ఆరోపించారు. స్వదేశీ మంత్రం జపించిన నేతలు నేడు విదేశీ కంపెనీలకు గులాంగిరి చేయడాన్ని ప్రజలు హర్షించరని వారు విమర్శించారు. ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి ప్రజలే స్వయంగా నడుం బిగించాలని వారు పిలుపునిచ్చారు. రాజ్యాంగంలో ప్రవచించిన సంక్షేమ రాజ్య భావనకు నేటి పాలకులు తిలోదకాలిస్తున్నారని వారు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటం దేశభక్తియుత పోరాటమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఈయూ కరీంనగర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి ఆర్. రాజేశం, మంచిర్యాల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎ. తిరుపతి రెడ్డి, ఎం. రామదాసు, సీనియర్ నాయకులు రమేష్ బాబు, శైలజ, శ్రీనివాస్, చరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కార్మిక హక్కుల కోసం సార్వత్రిక సమ్మె -- నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమం-బి.దత్తు నాయక్ .



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల్ కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.దత్తు నాయక్ మరియు ఐఎన్‌టీయూసీ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు నడికుడి శివ తెలిపారు.గురువారం నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా మహేశ్వరం మండల కేంద్రం,మహేశ్వరం పారిశ్రామిక ప్రాంతం,మంకల్,ఫ్యాబ్ సిటీ,తుక్కుగూడ,హార్డ్‌వేర్ పార్క్ తదితర ప్రాంతాల్లో ర్యాలీలు,బహిరంగ సభలు,బైక్ ర్యాలీలు నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బి.దత్తు నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని విమర్శించారు.బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక చట్టాలు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలతో కాకుండా కార్మిక వర్గం చేసిన పోరాటాల ఫలితంగా వచ్చాయని,ప్రస్తుతం వాటిని బలహీనపరచడం అన్యాయమని అన్నారు.2019 సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గంపై యుద్ధం చేస్తోందని, ఈ యుద్ధంలో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడి విజయం సాధించాలని పిలుపునిచ్చారు .పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం,కనీస వేతనాలు అమలు కాకపోవడం తీవ్ర ఆందోళనకరమని తెలిపారు. కార్మిక సమస్యలను పర్యవేక్షించాల్సిన లేబర్ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.భవిష్యత్తులో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరింత బలమైన ఆందోళనలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మగల రాజు,ఐఎన్‌టీయూసీ నాయకులు రాకేష్, నరసింహ,నవీన్,గణేష్,వైట్ క్లిప్ జనరల్ సెక్రటరీ ఎన్.యాదగిరి,సీపీఐ మండల సహాయ కార్యదర్శి డి.బ్రహ్మచారి,సాయి,కల్పన,వెంకటమ్మ, సుందరయ్య, శివ,నరసింహ,రవి,అంజి తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడి.**





**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12:-** గురువారం రోజున అబ్దుల్లాపూర్ మెట్ మండలం రెవిన్యూ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ...షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఏమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ లో ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందని అన్నారు..అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు...అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని సూచించారు.సుమారు 225 మంది కల్యాణ లక్ష్మీ..షాదీ ముబారక్ లబ్ధిదారులకు సుమారు 2 కోట్ల 25 లక్షల 26 వేల 100 రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు..రానున్న రోజుల్లో అతి తక్కువ సమయంలోనే చెక్కులను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి... ఎంపీడీవో శ్రీవాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి...వైస్ చైర్మన్ జప్త్ర,భాస్కర చారి, మాజీ జడ్పీటీసీ బింగి దాస్ గౌడ్, పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, కొత్త కుర్మ మంగమ్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుండ్ల పల్లి ధన్ రాజ్ గౌడ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎం ఆర్ ఆర్ యువసేన అధ్యక్షుడు బుర్ర మహేందర్ గౌడ్, తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు...మాజీ ప్రజా ప్రతినిధులు...కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు గౌసును దుర్భాషలాడుతూ మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**- రాష్ట్ర హోంగార్డు సంక్షేమ సంఘం**

**హైదరాబాద్ ఏస్టేట్ న్యూస్ ప్రతినిధి సంగారెడ్డి.** సంగారెడ్డి జిల్లా మున్సిపల్ ఎన్నికల విధుల్లో భాగంగా ఎన్నికల కమిషన్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా ఇందిరానగర్ 34 డివిజన్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు గౌస్ పై సంగారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గారు దుర్భాష లాడుతూ హోంగార్డుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం బాధాకరం సమాజ సేవ కోసం ప్రజల రక్షణ కోసం అనునిత్యం అహోరాత్రులు శ్రమించి ఆఖరికి ప్రజల ప్రాణాలు కాపాడాడం కోసం ఎంతోమంది హోంగార్డులు ప్రాణాలు అర్పించారు అధికారుల ఆదేశాలను శిరసావహిస్తూ విధులు నిర్వహిస్తున్న కిందిస్థాయి ఉద్యోగులపై రాజకీయ నాయకులు బెదిరింపులకు గురి చేయడం ఈ విధంగా ప్రవర్తించడం యావత్తు తెలంగాణ రాష్ట్ర హోంగార్డు తరపున రాష్ట్ర హోంగార్డ్ సంక్షేమ సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాము జగ్గారెడ్డి గారు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి డిమాండ్ చేస్తున్నాముఇది నా మీద దాడి కాదు –ఈ దేశ రక్షకుడిపై దాడి.వ్యక్తి పై కాదు నిన్ను కాపాడే వ్యవస్థపై దాడి
నా మౌనం బలహీనత కాదు,నా సహనం పలు సమస్యలకు పరిష్కారంనాకు బాధ్యతలు నేర్పిన వ్యవస్థలపై గౌరవం,నా నడక నిశ్శబ్దమైనా, న్యాయం వైపు సాగుతుంది నిరంతరం నిన్ను కాపాడే తెలంగాణ హోంగార్డు ని .. తెలంగాణ హోమ్ గార్డ్ ఆవేదనపుప్పాల. అశోక్..తెలంగాణ హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

# పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుందాం




**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12 :-** కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుందాం సాగర్ రింగ్ రోడ్ చౌరస్తాలో కార్మికులు పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్ హాజరై మాట్లాడుతూ ఈరోజు కార్మికు లందరూ కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోట్లకు వ్యతిరేకంగా కార్మికులం దరూ పెద్ద సంఖ్యలో కదలడం చాలా సంతోషంగా ఉందని ఉన్నారు, కేంద్ర బిజెపి ప్రభుత్వం, విద్యుత్ సవరణ చట్టం 2025.విబి జీ – రామ్ చట్టం, విత్తన సవరణ బిల్లు. ఎల్ఐసి లో 100% విదేశీ పెట్టుబడుదారులను అనుమతించడం. ఇలాంటి ప్రమాదకరమైన నిర్ణయాలను ఉపసమరించుకోవాలని, కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలను, వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఈరోజు అన్ని కార్మిక సంఘాలు, సమ్మెలో ఉన్నారు, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కోసం. కార్మికుల శ్రమను దోచుకోవడం కోసం, కేంద్ర బిజెపి ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాలను తీసుకొస్తుందని, ఆవేదన వ్యక్తం చేశారు, భవన నిర్మాణ కార్మికులకు, రావలసిన ఇన్సూరెన్స్, అన్ని కూడా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు, అప్పజెప్పడం, కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని అన్నారు, జిహెచ్ఎంసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి, కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన దుర్మార్గమైన చట్టాలను అమలు చేయమని, నిర్మాణం చేసి ప్రభుత్వానికి పంపాలని, అన్నారు, కార్మికులందరూ సాగర్ రింగ్ రోడ్ హస్తినాపురం చౌరస్తా వరకు ర్యాలీ, నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన రద్దు చేయాలని. ఎనిమిది గంటల పని అమలు చేయాలని. 12 గంటల విధానాన్ని రద్దు చేయాలని. కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆటో కార్మికులు జిహెచ్ఎంసి కార్మికులు,భవన నిర్మాణ కార్మికులు, హమాలి కార్మికులు. చిల్లర వ్యాపారస్తులు, హెచ్ఎండిఏ పార్కు సిఐటియు ప్రజా సంఘాల నాయకులు. పి రామస్వామి. కమర్, ఎం యాదయ్య.పురుషోత్తం చారి, ఎన్ లక్ష్మణ్. రాధమ్మ. కాశయ్య గంగమ్మ. కే రాములు. ఎల్లమ్మ. లక్ష్మణ్ నాయక్. అంజి నాయక్. యాదమ్మ. అలివేలు. జంగయ్య. గోపి. కృష్ణమూర్తి. లలిత పద్మ. జిహెచ్ఎంసి రంగారెడ్డి జిల్లా యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 15న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర

**- యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి**



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర ఈ నెల 15వ తేదీన బర్కత్ పుర లోని యాదాద్రి భవన్ నుంచి ప్రారంభమవుతుందని యాత్ర కమిటి చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి, గౌరవ సలహదారులు పడాల శ్రీకాంత్, అధ్యక్షుడు యం.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి బొమ్మల సుదీష్ కుమార్ తెలిపారు. గురువారం బర్కత్ పుర యాదాద్రి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖండ జ్యోతి రథయాత్ర ప్రచార పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ తేదీన ఆదివారం బర్కత్ పుర లో రథయాత్ర ప్రారంభమై 18వ తేదీన యాదగిరి గుట్టకు చేరుకుని అఖండ జ్యోతిని ఆలయంలో అందించడం జరుగుతుందని తెలిపారు. 15న రథయాత్ర ప్రారంభమై బర్కత్ పుర, చిక్కడపల్లి, విద్యానగర్, అడిక్మెట్, తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్, 16న ఉప్పల్, ఫిర్జాదిగూడ, మేడిపల్లి, నారపల్లి, అన్నోజిగూడ, శివారెడ్డిగూడెం, ఘట్కేసర్, 17న ఘట్కేసర్, కొండమడుగు, బీబీనగర్, గూడూరు, పగిడిపల్లి, భువనగిరి, 18న భువనగిరి, రాయగిరి, వడాయిగూడెం మీదుగా యాదగిరి గుట్టకు రథయాత్ర చేరుకుంటుందన్నారు. రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్ కుమార్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహ్మా మూర్తి, ఆలయ ఈవో జె.భవాని శంకర్, నగరిగారి ప్రీతమ్ కుమార్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యాదాద్రి భవన్ మేనేజర్ రామ కోటేష్, రథసారధి ఎ.గణపతి, ఎ. అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలో ఏ సమస్యలో ఉన్న పరిష్కరిస్తాం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి







**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12 :-** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జడ్జెస్ కాలనీ ఫేస్–1 నూతన వెల్ఫేర్ అసోసియేషన్ వారితో కలిసి మన ప్రియతమ నాయకులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జడ్జెస్ కాలనీ ఫేస్ -1 నూతన అధ్యక్షుడిని, కార్యవర్గ సభ్యులను సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు. కాలనీ సంక్షేమ సంఘం వారు తమ కాలనీలో గతంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ, ప్రస్తుతం కాలనీలో ఉన్న సమస్యల గురించి వివరించి, అట్టి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, వెంటనే వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి రవీందర్ రెడ్డి,జడ్జెస్ కాలనీ ఫేస్–1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అంజయ్య గౌడ్, ఉపాధ్యక్షులు కుమార స్వామి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య, కోశాధికారి గాలయ్య, ఇతర కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల దూకుడు

**- జాతీయ బిసి మహాసభ అధ్యక్షుడు రాజేందర్బి పటేల్ గౌడ్**



**హైదరాబాద్ ఏ స్టేట్ న్యూస్ ప్రతిదీ కాచిగూడ ఫిబ్రవరి 12:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు చూపిన ప్రదర్శన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రిజర్వేషన్ అమలులో రాజకీయ పార్టీల వైఖరిపై బీసీ సమాజం ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన సందేశం ఇచ్చిందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ అన్నారు.గురువారం కాచిగూడ లో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ వ్యవస్థలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆ అసంతృప్తి ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో వ్యక్తమైందని తెలిపారు.ఈ ఎన్నికల్లో మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు కలిపి 123 నగరపాలక సంస్థలలో 2,996 వార్డులకు పోలింగ్ జరిగింది. పార్టీలకు అతీతంగా అనేక మున్సిపాలిటీల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలకు ప్రజలు విశేష మద్దతు తెలిపారని రాజేందర్ పటేల్ వెల్లడించారు. ‘బీసీ ఓటు బీసీలకే’ అనే భావజాలం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బలంగా ప్రతిఫలించిందని చెప్పారు. ఇది కేవలం ఎన్నికల ఫలితం మాత్రమే కాదు, బీసీల సామాజిక ఆత్మగౌరవానికి సంకేతమని వ్యాఖ్యానించారు. బీసీల జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో కనీసం 50 శాతం ప్రాతినిధ్యం కల్పించేలా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు స్పష్టమైన విధానం ప్రకటించాలని రాజేందర్ పటేల్ డిమాండ్ చేశారు.

# బీఎస్ఎన్ఎల్ ప్రతిష్టాత్మకంగా పరిశోధన, ఆవిష్కరణ, ఇన్‌క్యూబేషన్ కేంద్రం ప్రారంభోత్సవం






**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి 12:-** రంగ రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ విద్యాసంస్థలలో , బీఎస్ఎన్ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ -- భారత ప్రభుత్వ టెలికాం సంస్థ) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక పరిశోధన, ఆవిష్కరణ ఉ ఇన్‌క్యూబేషన్ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. AIDEAS, DWAJ TECH LLP, CyberWalNet eT]jáTT Stratowave Solutions లాంటి దిగ్గజ కార్పొరేట్ సంస్థల సహకారంతో ఏర్పాటైన ఈ కేంద్రం తెలంగాణ రాష్ట్రంలో తొలి బీఎస్ఎన్ఎల్ రీసెర్చ్ ఉ ఇన్నోవేషన్ ఇన్‌క్యూబేషన్ సెంటర్‌గా కావడం విశేషం.విద్యాసంస్థల డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ రెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ బీఎస్ఎన్ఎల్ తో కలిసిన ఈ విలువైన భాగస్వామ్యానికి సహకారాన్ని అందించి ప్రోత్సహిస్తున్నందుకు అయన యాజమాన్యం తరపున అందరికి కృతజ్ఞతలు తెలియచేసారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన డా. ఎం. సత్య ప్రసాద్, డీజీఎం, బీఎస్ఎన్ఎల్, విశాఖపట్నం, ఇండస్ట్రీ 4.0, 5జీ, కృత్రిమ మేధస్సు , ఐఓటీ ) సైబర్ సెక్యూరిటీ ప్రాధాన్యతపై ప్రసంగించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న లెఫ్టినెంట్ కల్నల్ టి. ఎం. ప్రవీణ్ కుమార్ (రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్), సీనియర్ వైస్ ప్రెసిడెంట్, టీ–వర్క్స్, హైదరాబాద్, ఆవిష్కరణ కేంద్రాలు స్టార్టప్‌ల అభివృద్ధి, పరిశ్రమలకు సిద్ధమైన నైపుణ్యాల పెంప కంలో పోషించే కీలక పాత్రను వివరిస్తూ విద్యార్థులు మరియు పాల్గొన్న అధ్యాపక సిబ్బందికి తన సందేశాన్ని అందచే శారు.విద్యాసంస్థల వైస్ చైర్మన్ గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ , గురు నానక్ యూనివర్సిటీ ఉపకులపతి ఐన డాక్టర్. హెచ్. ఎస్. సైనీ, మాట్లాడుతూ పరిశ్రమ--విద్యా సంస్థల మధ్య సహకారం సురక్షిత డిజిటల్ వ్యవస్థల అవసరాన్ని వివరిస్తూ తమ విద్యాసంస్థలో అలాగే రాష్ట్రంలో తొలి బి ఎస్ యెన్ ఎల్ పరిశోధన సంస్థను ఏర్పాటు చేసినందుకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ అతిధులను సత్కరించారు.గురు నానక్ యూనివర్సిటీకి చెందిన రెక్టర్, రిజిస్ట్రార్ డైరెక్టర్లు ఈ కార్యక్రమానికి హాజరు కాగా డా. ఎస్. వి. రంగనాయకులు, డీన్ , తన ప్రసంగంలో అతిధులకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులకు సిబ్బందికి ధన్యవాదాలు తెలియచేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

**సూర్యాపేట: ఫిబ్రవరి 12, (హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్)** గురువారం రోజున మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంభందించి జిల్లా కేంద్రంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ లు ఓట్ల లెక్కింపు గదుల ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ ల భద్రత పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. ఎక్కడ కూడా లోపలి తలెత్తకుండా సమస్యలు రాకుండా పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారుల ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డులో ఉన్న అభ్యర్థులను ఏజెంట్లను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించబడుతుందని కలెక్టర్ తెలిపారు. లెక్కింపు గదులలో అభ్యర్థులు ఏజెంట్లు క్రమశిక్షణ పాటించాలని అధికారుల సూచనలు పాటించాలని కోరారు. సూర్యాపేట, కోదాడ, హుజుర్నగర్, మున్సిపాలిటీ కేంద్రాలకు మూడు చొప్పున లెక్కింపు గదులు, తిరుమలగిరి నేరేడుచర్ల మున్సిపాలిటీలకు రెండు చొప్పున లెక్కింపు గదులు మొత్తం 13 లెక్కింపు ప్రజలను కేటాయించడం జరిగిందని, ఆయా గదులలో వార్డులు, బ్యాలెట్ల ఆధారంగా లెక్కింపు టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఓట్ల లెక్కింపులో సమర్థవంతంగా విధులు నిర్వహించే



సిబ్బందిని కేటాయించాం అన్నారు. లెక్కింపు గదులలో పూర్తి భద్రతతో బారికేడింగ్ చేసి సీసీటీవీ నిఘా ఏర్పాటు చేశాం అన్నారు. లెక్కింపు కేంద్రాలలోకి ఎవరు కూడా సిరా సీసా, వాటర్ బాటిల్స్ మంటను ప్రేమించే వస్తువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి లేదు అన్నారు.అనంతరం జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ లెక్కింపు కేంద్రం వద్ద ఐదు అంచెల పోలీసు భద్రతను ఏర్పాటు చేశామని కళాశాల ప్రాంగణమంతా పోలీసు భద్రతలో ఉందని తెలిపారు. లెక్కింపు గింజలు నిర్వర్తించే సిబ్బంది, లెక్కింపుకు వచ్చే అభ్యర్థులు ఏజెంట్లు అధికారులు వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వాహనాలు పునరుద్ధరించడానికి ప్రణాళిక ప్రకారం పని చేస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు బ్యాలెట్ బాక్స్ స్ట్రాంగ్ రూమ్ లో వద్ద హాయిగా పోలీసులతో సహారా నిర్వహిస్తున్నామని తెలిపారు. లెక్కింపు గదులు పూర్తి భద్రతలో ఉన్నాయని సీసీ కెమెరాలు అన్ని గా ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమం నందు స్థానిక ఆర్డిఓ వేణుమాధవ్, డి.ఎస్.పి ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎమ్మార్వో కృష్ణయ్య, ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడంతో అడ్డుకున్న : ఎస్సీ సంఘం నాయకులు

**- రాత్రికి రాత్రి పర్మిషన్ లేకుండా శివాజీ విగ్రహం ఏర్పాటు**





**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని రాత్రికి రాత్రి రెండు గంటల ప్రాంతంలో మహేశ్వరం పోలీస్ స్టేషన్ ముందు ఉన్నటువంటి సర్కిల్ లో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ యొక్క విగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది, ఇవి విగ్రహాన్ని బిజెపి నాయకులు శివాజీ విగ్రహాన్ని తీసుకువచ్చి చౌరస్తాలో ఉన్న. బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, విగ్రహాలు పక్కన పెట్టడంతో దళిత వర్గాలు అందరూ హుటాహుటిన వచ్చేసి ఈ యొక్క విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం జరిగింది. ఈ ఒక విగ్రహం ఏర్పాటు వెంట ఎవరి హస్తము ఉన్నదని తెలుపాలని దళిత వర్గాలు అందరూ ధర్నాకు దిగడం జరిగింది, దళితులంతా ఏకమై మహేశ్వరం పోలీస్ స్టేషన్ ముందు ధర్నాలో పాల్గొని ఈ యొక్క విగ్రహం ఇంకా ఎవరెవరున్నారు మాకు తెలియాలని పట్టుబట్టి కూర్చోవడం జరిగింది, అలాగే శివాజీ విగ్రహం పెట్టడం మాకు ఎలాంటి అభ్యంతరం లేదు కాకపోతే బాబు జగ్జీవన్ రావు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలు ఉన్న వారి పక్కనే పెట్టడం ఏంటి అని ప్రశ్నించారు, శివాజీ విగ్రహాన్ని పెట్టండి మహేశ్వరంలో కానీ జగ్జీవన్ రామ్ ప్రక్కన అంబేద్కర్ ప్రక్కన పెట్టకుండా మరి ఎక్కడైనా పెట్టండి వారికి మా యొక్క సహాయ సహకారాలు అందిస్తామని ఆర్థికంగా మేము కూడా సహాయం చేస్తామని ముందుండి విగ్రహం పెట్టడానికి కృషి చేస్తామని తెలిపారు. కానీ రాత్రికి రాత్రి ఎవరు పర్మిషన్ లేకుండా గ్రామపంచాయతీ అలాగే పోలీసువారి పర్మిషన్ తీసుకొని పెట్టాలని తెలియజేశారు, ఇందులో భాగంగా శివాజీ విగ్రహం పెట్టిన నాయకుల దగ్గరికి పోలీస్ బృందం వెళ్లి మీరు చేసిన పని చాలా తప్పు అని వెంబడే ఆ విగ్రహాన్ని అక్కడ నుండి తీసి వేరే దగ్గర పెట్టా లని తెలియజేశారు,ఈ విషయంలో మేము తగ్గేది లేదు అని బిజెపి నాయకులు తెలిపారు, మీరు ఇలా ప్రవర్తిస్తే మీపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, పోలీసులు నాయకులకు తెలియజేశారు, బిజెపి సీనియర్ నాయకులకు పోలీసులు సర్దు చెప్పడంతో చెప్పడం మీ అక్కడినుండి విగ్రహం తీస్తాం కానీ మాకు తొందరలోనే న్యాయం జరిగేలా చూడండి శివరాత్రి బ్రహ్మోత్సవ లు ఉండడంవల్ల మేము ఎలాంటి ఘర్షణలు చేయొద్దని, మహేశ్వరం మండల కేంద్రంలోని ఈనెల 20వ తేదీన మా నాయకుల సమావేశం లో మీటింగ్ నిర్వహించడం జరుగుతుంది ఆ తర్వాత మేము ఎక్కడ స్థలం చెప్తే గ్రామపంచాయతీ అలాగే పోలీస్ పర్మిషన్ తీసుకొని పెద్దల సమక్షంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు, చౌరస్తా ఏర్పాటు చేసినటువంటి శివాజీ విగ్రహాన్ని తీసుకు వెళ్లడం జరిగింది, ఈ కార్యక్రమంలో, వివిధ గ్రామాల సీనియర్ నాయకులు, గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు కుల సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు కూలీలే శ్రీరామరక్షా: కిచ్చెన్న

**కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ చట్టాలు చేసింది: కెఎల్ఆర్**

**డీ సర్కార్ కర్షకుల సంక్షేమాన్ని తుంగలో తొక్కుతుంది.**

**ఐఎన్టియుసి సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న లక్ష్మారెడ్డి**

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడ లో కేఎల్ఆర్ మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమాన్ని తుంగలో తొక్కి... కార్పొరేట్ వ్యవస్థలకు లాభం చేసే 4 కేంద్ర చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గ ఐఎన్టియుసి అధ్యక్షుడు నడకుడ శివ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కర్షకనేత, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్.. ప్రధాని మోడీపై విమర్శలు చేశారు. కార్మిక, కర్షక, కూలీలు లేనిదే పరిశ్రమలకు మనుగడ లేదని అన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం... నాడు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన చట్టాలను ప్రధాని నరేంద్రమోడీ రద్దు చేశారని కిచ్చెన్న మండిపడ్డారు.కార్మికులు, రైతుల పొట్టకొట్టే చట్టాలను వెంటనే రద్దు చేయాలని లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. కొత్త చట్టాలను





రద్దు చేసే వరకు బీజేపీ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు.వీబీ జీరామ్ జీని వెంటనే రద్దు చేసి... మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కిచ్చెన్నగారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు ఐఎన్టియుసి సహా వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

# మాణిక్యమ్మగూడ నుంచి పలువురు పార్టీలో చేరిక

- **మున్సి'పల్స్" హస్తం వైపే:- లక్ష్మారెడ్డి**
- **అభివృద్ధి- సంక్షేమం కాంగ్రెస్ కు రెండు కళ్లు**
- **ఎంపీటీసీ/ జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలి: కేఎల్ఆర్**

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని తుక్కుగూడ లో కేఎల్ఆర్ మాట్లాడుతూ..రేపటి మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించనున్నారని మరోసారి స్పష్టం చేశారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.మహేశ్వరం మండలం మాణిక్యమ్మగూడ నుంచి పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, నాయకురాళ్లు... కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.మాణిక్యమ్మగూడ కంటెస్టేడ్ సర్పంచ్ రమ్య, సీనియర్ లీడర్ దాస్, లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా కిచ్చెన్న మాట్లాడుతూ... రేపటి పురపోరు ఫలితాల్లో బీజేపీ అడ్రస్ గల్లంతు కానుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదన్నారు.
త్వరలో జరగనున్న ఎంపీటీసీ/ జడ్పీటీసీ ఎన్నికల్లో మహేశ్వరం, కందుకూరు మండలాల్లో హస్తం పార్టీ తిరుగులేని హవా కొనసాగించనుందని లక్ష్మారెడ్డి గారి కిచ్చెన్న తెలిపారు.
సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి- సంక్షేమం జోడు



గుర్రాల్లా పరుగులు పెడుతున్నాయని అందుకే తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీ వైపు ఉందన్నారు కేఎల్ఆర్
ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు దావిద్, ఎర్ర పెంటయ్య, మల్లేష్ సహా నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.

# మజ్లిస్ పార్టీకి మేయర్ పీఠం కట్టబెట్టడానికే జిహెచ్ఎంసిని పునర్విభజన చేశారా



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి**

మజ్లిస్ పార్టీకి హైదరాబాద్ మేయర్ పీఠాన్ని కట్టబెట్టడానికే జిహెచ్ఎంసిని పునర్విభజన చేసినట్లుందని బిజెపి నాయకులు. పెరమోని నరేష్ యాదవ్, గుర్జని గణేష్ గౌడ్, ఎండీ నయీమ్ అడ్వకేట్, లు అన్నారు . మామిడి పల్లిలోని బీజేపీ కార్యాలయం లో మీడియా తో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పే ట్, జల్ పల్లి సర్కిళ్ళతో పాటు ఇబ్రహీంపట్నం నియోజకవ ర్గంలోని ఆదిభట్ల సర్కిల్ను, రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని రాజేంద్రనగర్ సర్కిల్తో పాటు శంషా బాద్ సర్కిల్ను శంషాబాద్ జోన్ కిందకు తీసుకువచ్చి ఆ జోన్ మొత్తాన్ని హైదరాబాద్ కార్పొరేషన్లో విలీనం చేయడంపై మండిప డ్డారు. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నమన్నారు . దీని వల్ల రంగారెడ్డి జిల్లా అస్తిత్వం దెబ్బతింటుం దని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సైబరాబాద్, మల్కా జిగిరి కార్పొరేషన్లను పక్కన బెడితే హైదరాబాద్ కార్పొరే షన్ను కేవలం మజ్లిస్ కు కట్టబెట్టడానికే కాంగ్రెస్ ప్రభు త్వం ఈ విధమైన నిర్ణయం తీసుకుందని దుయ్యబ ట్టారు. స్థానిక నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నబితా ఇంద్రారెడ్డి, మ ల్రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్ గౌడ్లు సైతం స్పందించి ప్రభుత్వ ని ర్ణయాన్ని పునః పరిశీలించే విధంగా కోరాలన్నా రు. ఇక్కడి ప్రజల అభిప్రాయాలను గౌరవించి ప్రభుత్వం హైద రాబాద్లో కలపకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో ప్రజలతో కలసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టుతామని హెచ్చరించారు.

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

**అక్రిడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం**

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్: ఫిబ్రవరి 12, (హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్)** అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ శ్రీమతి సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్వో శ్రీ జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతోదాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా తహసిల్దార్ ఎదుట నిరసన. ప్రజాసంఘాలు



**నర్సరావు పేట/** రైతులు కార్మికులు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని గురువారం ప్రజాసంఘాల నాయకులు పాల్గొని తాహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడిఎం జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో అనేక ప్రజా వ్యతిరేక చట్టాలు ఆమోదింపజేసుకొని కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడమే గాక దేశంలోని రైతులకు గిట్టుబాటు ధరలు లాంటి హామీలు నెరవేర్చకుండా అమెరికాలో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుని,ఆహార వాణిజ్య ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటూ ఈ దేశంలో రైతులను నట్టేట ముంచుతున్నారని, దీనికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో ప్రజలందరం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోటానాయక్,గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా 24 లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసి అమెరికా ట్రంప్ తో అనేక ఒప్పందాలకు తెచ్చుకొని కార్పొరేట్ల భజన చేస్తున్నాడని దీనికి వ్యతిరేకంగా ఇదే స్ఫూర్తితో పెద్ద ఎత్తున రాబోయే రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు , నల్లపాటి రామారావు, ఏఐవైఎఫ్ నాయకులు బి. రాంబాబు నాయక్ దళిత నాయకులు థామస్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR R R DIST., TELANGANA,
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876